క్లుప్తంగా

శివాలయంలో జడ్జి దంపతుల పూజలు



కృత్తివెన్ను: బంటుమిల్లి కోర్టు న్యాయమూర్తి ఈ సుధాకర్ దంపతులు సోమవారం కృత్తివెన్ను శివాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మురళీకృష్ణ వారి చేత స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామివారి ఆలయ విశిష్ఠతను, ఆలయ దివ్య చరిత్రను వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆటిజం రుగ్మతపై అవగాహన

గూడూరు: మంద బుద్ధి (ఆటిజం)ని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా జీవన నాణ్యత మెరుగుపర్చుకోవచ్చని గూడూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.అనురాధ అన్నారు. ఏప్రిల్ 2 వరల్డ్ ఆటిజం ఎవేర్‌నెస్‌డే సందర్భంగా గూడూరు నాన్‌భవిత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం గూడూరు మెయిన్ స్కూలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటిజం అనేది ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వారికి తగిన తోడ్పాటు అందించి, వారిలో జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఐఈ ఆర్పీ రమాదేవి పాల్గొన్నారు. రేవంత్ అనే విద్యార్థికి రోలేటర్‌ను పంపిణీ చేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలోని కోనేరుసెంటర్ సమీపంలోని క్లాత్‌బజారులో వాసవీక్లబ్ మచిలీపట్నంశాఖ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వివిధ పనులపై నగరానికి వచ్చే పాదచారుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని వాసవీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. రెండు నెలల పాటు ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు ఎ. అశోక్ కుమార్, కార్యదర్శి టి.పవన్‌కుమార్, కోశాధికారి ఎం.దీపు, నాయకులు వేముల శిరీష, వై.సురేష్, శ్రీకాకోళపు రేణుకారాణి, దివ్యశ్రీ, అనూరాధ, సునీత తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

కోడూరు: ఉపాధి హామీ పథకం కింద పనులను విశ్వనాథపల్లి గ్రామంలో సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణ రావు ఈ పనులను ప్రారంభించారు. గ్రామంలో చెరువు తవ్వకం పనులకు శ్రీకారం చుట్టినట్లు పథకం ఏపీఓ రాజ్‌కుమార్ తెలిపారు.

సబ్‌జైల్ ప్రధాన డ్రెయిన్‌లో పూడిక తీత

మచిలీపట్నంటౌన్: నగరంలోని 11వ డివిజన్ పరిధిలో ఉన్న సబ్‌జైల్ ప్రధాన డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు పనులు సోమవారం నిర్వహించారు. డివిజన్‌లో ఈ డ్రెయిన్ శివారు ప్రాంతం కావటంతో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ఫలితంగా డ్రెయిన్‌లో ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు వేగంగా ప్రవహించేందుకు ఆటంకం ఏర్పడుతుండటంతో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదేశాలతో నగర పాలక సంస్థ అధికారులు ఈ పూడికతీత పనులను చేపట్టారు. పనులను వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు పర్యవేక్షించారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు గ్రామంలో సాయంత్రం 4 గంటలకు పలు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ వి.చినబాబు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎం.రాజబాబులు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.
పెడన: డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం చెన్నూరులో మంగళవారం నిర్వహిస్తున్నట్టు వెలుగు ఏపీఎం శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మాజీ మంత్రి సోమిరెడ్డి వ్యాఖ్యలకు ఖండన

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు మిర్జా రియాజ్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులను హింసించిన ఘటనలను ఉద్యోగులు ఇంకా మరిచిపోలేదన్నారు. గత ఎన్నికల సమయంలో ఉద్యోగులు టీడీపీకి వ్యతిరేకంగా ఓట్లు వేసి గుణపాఠం చెప్పారన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం ఉద్యోగులు టీడీపీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులపై నోరుపారేసుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రియాజ్‌హుస్సేన్ హెచ్చరించారు.

మచిలీపట్నం.. అభివృద్ధి పథం

- జిల్లా విభజనతో పెరిగిన ప్రాముఖ్యత
- నాడు జిల్లా కేంద్రమైనా పాలన విజయవాడ నుంచే..
- నేడు జిల్లా ఆవిర్భావ దినోత్సవం



కలెక్టర్ కార్యాలయం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం గతం నుంచే జిల్లా కేంద్రంగా ఉన్నా ఆశించిన మేర అభివృద్ధికి నోచుకోలేదు. అధికార యంత్రాంగం పాలన అంతా విజయవాడ కేంద్రంగానే సాగుతూ వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఉమ్మడి కృష్ణా జిల్లాను కృష్ణ, ఎన్‌టీఆర్ జిల్లాలుగా విభజించిన అనంతరం మచిలీపట్నంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. జిల్లా విభజించబడి ఈ నెల 4వ తేదీ మంగళవారంతో ఏడాది పూర్తవుతోంది. ఈ ఏడాదిలో పట్నం ప్రాముఖ్యతను పెంచే ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి..

ఈ ఏడాది కాలంలో..

ఈ ఏడాది కాలంలోనే జిల్లా కేంద్రంగా ఉన్న మచిలీపట్నం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. జిల్లా కలెక్టర్ నుంచి ఇతర శాఖల అధికారులు ఇక్కడి నుంచే పాలన సాగిస్తుండటంతో ప్రాధాన్యత పెరిగింది. జిల్లా విభజనతో పాటు వైఎస్సార్ సీపీ పాలనలో మచిలీపట్నం నగర పాలక సంస్థగా ఏర్పడటంతో అందరి దృష్టి మచిలీపట్నంపై పడింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యకలాపాలు నగరంలో అధికమయ్యాయి. జిల్లా విభజనకు ముందు ఇటువైపు చూడని పలు పేరున్న వర్తక, వాణిజ్య సంస్థలతో పాటు బ్యాంకులు, బ్యాంకుల ప్రాంతీయ కార్యాలయాలు నగరంలో ఏర్పాటయ్యాయి. ఇంకా ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పెరిగిన ఉపాధి అవకాశాలు..

నగరంలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడటంతో నివాసితులు కూడా పెరిగారు. నివసిస్తున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా పలు వ్యాపారాలు ఊపందుకున్నాయి. కర్రీపాయింట్ల నుంచి రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు వంటివి నగరంలో పెరిగాయి. కార్పొరేట్ సంస్థ అయిన డీమార్ట్ తన బ్రాంచ్‌ను ఇక్కడ ఏర్పాటు చేసింది. పేరుమోసిన ఎలక్ట్రానిక్, మొబైల్, వస్త్ర షోరూమ్‌లు ఏర్పాటయ్యాయి. డీమార్ట్ పక్కనే మల్టీప్లెక్స్ నిర్మాణం కూడా జరుగుతోంది. నగరంలో అపార్ట్‌మెంట్లతో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం మరింత పెరిగింది.

వ్యాపారాలతో కూడళ్లు కళకళ..

జిల్లా విభజన అనంతరం నగరంలోని ఇతర కూడళ్లలో వ్యాపార సంస్థలను స్థాపించటంతో ఆయా కూడళ్లు కళకళలాడుతున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ ఏదొక సంస్థలో పనిచేసేందుకు వస్తుండటంతో అద్దె ఇళ్లకు గిరాకీ పెరిగింది. ఏదైనప్పటికీ మచిలీపట్నం జిల్లా విభజన అనంతరం నగరానికి పూర్వ వైభవం సంతరించుకుంటోందనటంలో అతిశయోక్తి లేదు.

అందుబాటులో అధికారులు..



గతం నుంచి మచిలీపట్నం జిల్లా కేంద్రంగానే ఉంది. విభజన అనంతరం అధికారులు పూర్తిస్థాయి అందుబాటులో ఉంటున్నారు. విభజన ఫలాలు భవిష్యత్తులో ప్రజలకు మరింతగా అందుతాయి. కార్పొరేట్ సంస్థలను ఏర్పాటు చేస్తున్నారు. రానున్న రోజుల్లో నగరం మరింత అభివృద్ధి చెందుతుంది.

–మద్దుల గిరీష్, కృష్ణాజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

కొత్త సంస్థలు ఏర్పాటవుతున్నాయి..



జిల్లా విభజనతో మచిలీపట్నంలో పలు కార్పొరేట్ సంస్థలు వ్యాపారాలు ప్రారంభించాయి. మరిన్ని సంస్థలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా అధికారులు ఇక్కడే ఉండి పాలన సాగిస్తుండటంతో ప్రజల రాకపోకలు అధికమయ్యాయి. సామాన్య ప్రజలు కార్పొరేట్ సంస్థలు రావటంతో జీవనం మెరుగుపడుతోంది.

–ఉదయగిరి సురేష్, కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు, మచిలీపట్నం

రేపు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 5వ తేదీన సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ 116వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి సోమవారం తెలిపారు. 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు మచిలీపట్నం మల్కాపట్నంలోని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశపుహాలులో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని ఆమె కోరారు.

కనుల పండువగా ఎదుర్కోలు ఉత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వధూవరాన్వేషణం (ఎదుర్కోలు ఉత్సవం) కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే దివంగత పెదశింగు లక్ష్మణరావు, కృష్ణారావు గృహం వద్ద నిర్వహించారు. జ్యోష్యుల రాంప్రసాద్, కాండూరి లక్ష్మీనరసింహాచార్యులు ఈ కార్యక్రమానికి సంధాన ప్రసంగీకులుగా వ్యవహరించారు. పలు పూజా కార్యక్రమాలను అర్చకుడు ముత్తేవి వెంకటాచార్యులు బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి ఎన్. చక్రధరరావు పర్యవేక్షించారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్ వద్ద విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీవైఈవో సుబ్బారావు

మచిలీపట్నంటౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని 17 పరీక్ష కేంద్రాల్లో 2352 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 2374 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 22 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో తాహెరా సుల్తానా, డీవైఈవో యుపీ సుబ్బారావు, ఎంఈవో దుర్గాప్రసాద్ పరిశీలించారు. మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ నగరంలోని పలు దేవాలయాలు, చర్చిల్లో ఉదయం పూజలు నిర్వహించారు. అనంతరం పరీక్ష కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాశారు.

పెడన: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 143 పరీక్షా కేంద్రాల్లో 19,874 మంది విద్యార్థులకు 19,547 మంది విద్యార్థులు హాజరయ్యారని, 327 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సుల్తానా తెలిపారు. పెడన మండలంలో భట్ట జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏ, బీ సెంటర్లు, పల్లోటి విన్సెంట్ హైస్కూలలో ఏ, బీ సెంటర్లు, చెన్నూరు జెడ్పీహెచ్‌ఎస్‌లోను 680 మంది విద్యార్థులకు 674 మంది హాజరయ్యారు. పరీక్షా రాయడానికి వీల్లేని పలువురు అభ్యర్థులకు విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి పత్రాలను చూపించడంతో వారు చెప్పిన జవాబులను రాయడానికి 9వ తరగతి విద్యార్థులను ఏర్పాటు చేశారు. భట్ట జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లో పెడన సర్కిల్ ఇనెస్పెక్టర్ ఎస్ ప్రసన్నవీరయ్యగౌడ్ సందర్శించి పరీక్షల అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తదితరులున్నారు.

అవనిగడ్డ: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,483 మంది పరీక్ష రా యాల్సి ఉంది. తొలిరోజు 20మంది విద్యార్థులు గై ర్హాజరు అయ్యారు. అవనిగడ్డలో నాలుగు కేంద్రాల్లో 542 మందికి ఇద్దరు గైర్హాజరు కాగా, ఘంటసాల మండలంలో 251కి ఆరుగురు, నాగాయలంక మండలంలో 352కి 8 మంది గైర్హాజరు అయ్యారు. డీ ఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో అవనిగడ్డ, చల్లపల్లి సీఐ శ్రీనివాస్, రవికుమార్ పర్యవేక్షణలో పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది ప్రతిష్ట బందోబస్తు ఏ ర్పాటు చేశారు. డీఎస్పీ మహబూబ్‌బాషా పలు ప రీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అవనిగడ్డ ఎంఈవో ఎన్.శివశంకరరావు ఏర్పాట్లను పరిశీలించారు.

కోడూరు: మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల వద్ద 348 మందికి గాను 344 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్షలు రాశారు. నలుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈఓ శివశంకరరావు తెలిపారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల వద్ద 171 మందికి 167 మంది, రవితేజ పబ్లిక్ స్కూల్‌లో 177 మందికి గాను 177 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈఓ చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఎగ్జామ్ ఛీఫ్‌లుగా ఉపాధ్యాయులు రమణ, అనురాధలు వ్యవహరించారు. ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

చల్లపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎస్‌ఆర్ వైఎస్‌సీ హైస్కూల్, విజయా హైస్కూల్, శ్రీచైతన్య స్కూల్, గురుకుల పాఠశాల, కొత్తమాజేరు జెడ్పీ హైస్కూల్స్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా విద్యార్థులు కేంద్రాలకు హాజరయ్యారు.

కృత్తివెన్ను: పదో తరగతి పరీక్షలు మొదటిరోజు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచే పరీక్షా హాలులోకి అనుమతించారు. ఉదయం 9.30 నిముషాలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. సంగమూడి, లక్ష్మీపురం పోడు ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో ప్రసాద్ తెలిపారు. కృత్తివెన్ను ఎస్‌ఐ గణేష్‌కుమార్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వద్ద సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు ఉండకూడదని సూచనలిచ్చారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగు నీరు, వైద్యసదుపాయం ఏర్పాటు చేశారు.

గూడూరు: మండలంలోని 382 మంది విద్యార్థుల కోసం గూడూరు, కంకటావ, మల్లవోలు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొదటి రోజు 378 మంది పరీక్షలు రాశారు. గూడూరులో ఇద్దరు, మల్లవోలులో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. తహసీల్దారు బి.విజయప్రసాద్ గూడూరు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని, ఎవరూ ఉల్లంఘించవద్దని ఆయన కోరారు.

మోపిదేవి: మండల పరిధిలో మూడు పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్‌తో కలసి సోమవారం పరిశీలించారు. మండలంలోని మోపిదేవి జెడ్పీపాఠశాలలో 183 మందికి 183 మంది విద్యార్థులు, పెదకళ్లేపల్లి జెడ్పీపాఠశాలలో 73 మందికి అందరూ హాజరయ్యారు. మోపిదేవి గురుకుల పాఠశాలలో 93 మందికి అందరూ పరీక్షకు హాజరయినట్లు ఛీఫ్ సూపరింటెండెంట్స్ కొడాలి బాల నాగేశ్వరశర్మ, కృష్ణప్రసాద్, ఏ వెంకటేశ్వరావు తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీరాములు, ఎస్‌ఐ పద్మ, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, జీఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

11, 14 తేదీల్లో మద్యం షాపులు మూసేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు

ఘంటసాల(అవనిగడ్డ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున మద్యం షాపులను మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు నాగేశ్వర రావు కోరారు. కొడాలి గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతికి మద్యం షాపులు మూస్తున్నట్టే ఏప్రిల్ 11న జ్యోతీరావు పూలే, 14న అంబేడ్కర్ జయంతి రోజున మద్యం షాపులు మూసేయాలని డిమాండ్ చేశారు. వీరిద్దరి జయంతి వేడుకలను ప్రతి దళిత, బీసీవాడల్లో ఘనంగా జరుపుకోవాలని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల అధ్యక్షులు గరికముక్కు నాగేశ్వరరావు, కొడాలి దేవా, మండల నాయకులు దేవరపల్లి డేవిడ్‌రాజు, కనగాల శివాజీ, కుంపటి వీరరాఘవులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జాతర జరిగేలా చూద్దాం

- సమన్వయ సమావేశంలో సీఐ శ్రీనివాస్
- రేపు లంకమ్మ అమ్మవారి జాతర



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

అవనిగడ్డ: ఈనెల 5న జరగనున్న స్థానిక శ్రీలంకమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లకై పలు శాఖల అధికారులు సోమవారం ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. స్థానిక ఆలయ ప్రాంగణంలోని మండపంలో జరిగిన సమావేశంలో సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభలు, మందిరాలు కట్టుకోవాలనుకున్న వారు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రూట్ మ్యాప్ తెలియజేస్తామన్నారు. ప్రత్యేక సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, ఆలయ ఈవో పి. సీతారామయ్య మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. అమ్మవారి సంబరం భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రామకృష్ణతో పాటు పలు శాఖల అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎంసీఏ చదువుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి అద్దంకి గణేష్ కుటుంబానికి విశ్వవిద్యాలయం విద్యార్థులు సేకరించిన రూ.1.32 లక్షల విరాళాన్ని సోమవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రామమోహన్‌రావు చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గణేష్ వంటి విద్యార్థిని కోల్పోవటం బాధిత కుటుంబానికే కాదు, యూనివర్శిటీకే తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంసీఏ విభాగం అధ్యాపకుడు ప్రొఫెసర్ వైకె.సుందరకృష్ణా, డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్, డాక్టర్ ఆర్.విజయకుమారి, డాక్టర్ ఎం.బాబు రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గం రెండేళ్లు పూర్తి

మోపిదేవి: పంచాయతీ గ్రామ ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామని సర్పంచ్ నందిగం మేరీరాణి అన్నారు. మండల కేంద్రం మోపిదేవి పంచాయతీ పాలకవర్గం రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్పంచ్ మేరీరాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవలు అందిస్తామని తెలిపారు. పంచాయతీ అభివృద్ధి సహకరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావుకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు, కార్యదర్శి త్రిపురసుందరి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పనివేళల్లో మార్పు

కైకలూరు: వేసవి నేపథ్యంలో మంగళవారం నుంచి మే 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పని చేస్తాయని కై కలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బి.ఆనంద్‌బాబు సోమవారం చెప్పారు. ఉదయం వచ్చిన చిన్నారులను మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఇంటికి ఆయాలు పంపుతారన్నారు. కేంద్రాల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిర్దేశించిన వేళల ప్రకారం కేంద్రాలను నిర్వహించాలని ఆదేశించారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- మంత్రి జోగి రమేష్
- గూడూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు



గూడూరులో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు సోమవారం సాయంత్రం గూడూరులోని జెడ్పీ హైస్కూలు గ్రౌండ్‌లో నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి మంత్రి జోగి రమేష్ పూల మాలలు వేసి నివాళులర్పించగా, డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా నవరత్నాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 95 శాతం హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పరిపాలనా వికేంద్రీకరణతో ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా వైద్యులే మన ఇంటికి వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స కూడా అందిస్తారన్నారు. వైఎస్ జగన్‌ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. గూడూరు క్లస్టర్ పరిధిలోని జక్కంచర్ల, కలపటం, గురిజేపల్లి, తరకటూరు, కంకటావ, పినగూడూరులంక, నారికేడాలపాలెం, చిట్టిగూడూరు, కోకనారాయణ పాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లోని 371 స్వయం సహాయక సంఘాలల్లోని 3686 మంది మహిళలకు రూ.3.69 కోట్ల చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ గొరిపర్తి వరలక్ష్మి, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, సర్పంచి లింగం సులోచనారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల వెంకట కృష్ణారావు, పర్లం పెదబాబు, అంబటి కాంతారావు, జక్కా ధర్మారాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అందరికీ అండగా జగనన్న

కోనేరుసెంటర్: అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న ఉన్నాడన్న విషయాన్ని మహిళలు మరువకూడదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. కానూరు, పెదపట్నం, గోకవరం, చిరివెళ్ళపాలెం, బుద్దాలపాలెం, బొర్రపోతుపాలెం, అరిశేపల్లి, సుల్తానగరం గ్రామాల్లో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం వారోత్సవాల్లో కిట్టు పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలన్నారు. 175 సీట్లు గెలవాలనే ఆయన ఆశయానికి అహర్నిశలు శ్రమించాలన్నారు. వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాలిశెట్టి రవిశంకర్, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, వ్యవసాయ సలహామండలి నాయకుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



13వ డివిజన్‌లో పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నగరంలో సోమవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేశారు. ఈ నెల 1వ తేదీనే పింఛన్ల పంపిణీ జరగాల్సి ఉన్నా బ్యాంకుల సెలవుల కారణంగా వాయిదా పడింది. సోమవారం బ్యాంకుల నుంచి పింఛను పంపిణీకి సంబంధించిన సొమ్మును విత్‌డ్రా చేసిన నగరపాలక సంస్థ అధికారులు వలంటీర్ల ద్వారా మధ్యాహ్నం నుంచి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభింపజేశారు. నగరంలో మొత్తం 18,627 పింఛన్లు ఉండగా దాదాపు వెయ్యి మందికి పంపిణీ చేశారు. మంగళవారం పింఛన్ల పంపిణీ పూర్తిస్థాయిలో జరగనుంది. ఈ పంపిణీ కార్యక్రమాన్ని నగరంలోని పలు డివిజన్లలోని వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహసారథులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ప్రవచనం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేట కో దండరామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 'శ్రీరామ ధర్మం' అనే అంశంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకర శ్రీనివాసాచార్యులు చేసిన ఈ ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం ఆలయ భక్త బృందం ప్రవచనకర్త శ్రీకర శ్రీనివాసాచార్యులును సత్కరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయ రాధిక

చల్లపల్లి: మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కోట విజయరాధిక ప్రారంభించారు. స్థానిక పెదకళ్లేపల్లి రోడ్డులో బండ్రేవుకోడు ఎడమ వైపు రోడ్డు గొడపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వరకు 90 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నానీ), కొల్లి మురళీ పాల్గొన్నారు.